www.prajasakti.com

# ప్రజాశక్తి

ఆదివారం 18 మే 2025 | 5 | పశ్చిమ గోదావరి



## గూడెంలో భారీ వర్షం

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**



కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం సుమారు గంటన్నర పాటు వర్షం దంచి కొట్టింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయేలా గాలి వాన ఈదురు గాలులతో స్తంభించేలా చేసింది. ఒకపక్క వాన మరోపక్క గాలి రావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వర్షం విరుచుకుపడటంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు నుంచి వ్యాపారులు, పట్టణానికి వచ్చి ఇళ్లకు వెళ్లే రైతులు అంతా కూడా గంటపాటు నిలిచిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఇలా ఉండగా సుమారు రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణ ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

# రేషన్ కార్డుల కష్టాలు..!

ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ డౌన్‌లోనే
ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగెత్తిపోతున్న జనం
అందుబాటులోకి రాని 'మనమిత్ర' వాట్సప్ సేవలు
ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 9,142 దరఖాస్తులు
అత్యధికంగా కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులు 6,673
ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా 'పశ్చిమ' సివిల్ సప్లయ్ అధికారుల తీరు

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**



కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు జనం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట, లేక తెల్లవారుజామున సర్వర్ పనిచేయడంతో ఆ సమయంలో వచ్చి పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల ఏడో తేదీన నుంచి కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అప్పటి నుంచి సర్వర్ సమస్య వెంటాడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కాలంగా కొత్త రేషన్‌కార్డులు జారీ లేకపోవడం, రేషన్ కార్డుల చేర్పులు, తొలగింపు వంటివి చేయకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అర్హులందరూ గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఈనెల 15వ తేదీ నుంచి మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినా అమల్లోకి రాలేదు. దీంతో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రేషన్‌కార్డులతోపాటు మొత్తం ఏడు సేవలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 9,142 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్త రైస్ కార్డు దరఖాస్తులు 959, ఉమ్మడికార్డులో విభజనకు సంబంధించి 658, కొత్త సభ్యుల చేర్పు దరఖాస్తులు 6,673, మరణించిన సభ్యుల తొలగింపు 260, తప్పు ఆధార్ సీడింగ్ సరిచేసేవి 93, కార్డు సరెండర్‌కు సంబంధించి 11, చిరునామా మార్పు దరఖాస్తులు 177 వరకూ వచ్చాయి. సర్వర్ సరిగ్గా పనిచేస్తే ఈపాటికి రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యే పరిస్థితి ఉండేది. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. జూన్‌లో కొత్త రేషన్‌కార్డుల మంజూరు ఉంటుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. సర్వర్ సమస్యతో కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఒంటరి మహిళలకు సంబంధించి స్పష్టత కరువు**

కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ సాగుతుండడంతో ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్తున్నా నిరాశే మిగులుతోంది. ముఖ్యంగా వివాహమై భర్తకు ఏళ్ల తరబడి దూరంగా ఉంటున్న ఒంటరి మహిళలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ జరగడం లేదు. విడాకులకు సంబంధించిన వివరాలు ఉండాలంటూ చెబుతున్న పరిస్థితి నెలకొంది. భర్త నుంచి దూరమయ్యే అనేక మంది మహిళలు ఒంటరిగా పిల్లలతో జీవిస్తున్నారు. విడాకుల కోసం తిరగలేక, ఆర్థిక స్తోమత లేక అలానే ఉండిపోయారు. అలాంటి ఒంటరి మహిళలకు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించకుండా ఆంక్షలు విధించడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా 'పశ్చిమ' పౌరసరఫరాల శాఖ అధికారులు**

కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ సాగుతోంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించే ప్రక్రియ అంతా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల వివరాలు తమకు తెలీదని, రాష్ట్ర కేంద్రంలో ఉంటాయంటూ సమాధానం చెబుతున్నారు. మిగిలిన జిల్లాల పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో సమాచారం ఉన్నప్పుడు పశ్చిమగోదావరి జిల్లా అధికారుల వద్ద ఎందుకు ఉండదో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల దరఖాస్తులకు సంబంధించిన సమాచారం మీడియాకు చెప్పకుండా దాటవేత ధోరణితో మాట్లాడుతున్నారు. ఇది ఒకరకంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన ప్రక్రియ ఏవిధంగా సాగుతోంది? ప్రభుత్వం ఏంచేస్తుందో వంటి వివరాలు ప్రజలకు తెలిసినప్పుడే పాలనపై జనంలో ఒక అభిప్రాయం ఏర్పడుతోంది. లేకపోతే ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు తెలియకుండా పోనుంది.



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

## వైద్యుల కొరతను అధిగమించేందుకు చర్యలు

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**ప్రజాశక్తి - తణుకు**

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి సలహా సంఘం సమావేశం శనివారం ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యులతో పాటు, సాధారణ వైద్యులు, ఇతర టెక్నీషియన్ల పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు సమర్థవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అయితే మరింత మందికి సేవలు విస్తృతం చేసేందుకు వీలుగా 10 బెడ్ల స్థాయి నుండి 15 బెడ్ల వరకూ పెంచడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. తణుకులో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు ఇప్పటికే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు వచ్చాయని, త్వరలోనే అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వాసుపత్రికి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారని, అందుకు అనుగుణంగా ఆసుపత్రిలో సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అనంతరం తణుకు ఆర్‌టిసి డిపోను ఎంఎల్‌ఎ రాధాకృష్ణతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు ఆవరణలో నిర్మించనున్న పింక్ టాయిలెట్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల బకాయిలు వేతనాలు చెల్లించాలి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

వారాల తరబడి ఉపాధి కూలీల వేతనాలు బకాయిలు ఉంటే వారు ఎలా బతుకుతారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం వెంకటరామన్నగూడెంలోని ఉపాధి పని ప్రదేశాన్ని సందర్శించి అక్కడ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మా పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని తెలిపారు. శుక్రవారం ఒక ఉపాధి కూలీ పని చేస్తుండగా ఓ కొండచిలువ అతని కాళ్లు, నడుము చుట్టేసిందని, అతను కేకలు వేయగా పక్కన ఉన్న కూలీలు కాపాడే క్రమంలో మహిళకు, మగ కూలికి చేతులు విరిగిపోయాయని తెలిపారు. మందుబాబులు తాగేసి కాలువలో పడవేసిన సీసా పెంకులతో కళ్లు తెగి నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. 7, 8 వారాల నుండి వేతనాలు రావడం లేదని వాపోయారు. సంఘం నాయకులు సోమరాజు మాట్లాడుతూ ఉపాధి పని ప్రదేశంలో కొండ చిలువ ప్రమాదంలో చేతులు విరగ్గొట్టుకున్న వారికి తక్షణం ప్రభుత్వం వైద్యం అందించి, ఉపాధి సహకారం అందించాలని కోరారు. తక్షణం పెండింగ్ వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని కూలీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



తాడేపల్లిగూడెం : కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేత సోమరాజు

**తణుకు రూరల్ :** పెండింగ్ వేతనాలు వడ్డీతో కలిపి తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండలం పాలి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ఉపాధికి కేటాయించిన నిధులు దారి మళ్లించి దేవాలయాలు, కోనేర్లు, భూస్వాముల పొలాల్లో పండ్ల తోటలు, ఉద్యానవనాల కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాయం వెంకన్న, టిఎల్.వెంకటేశ్వరరావు, సికిలే మంగతాయారు, ధనలక్ష్మి, మరియమ్మ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య

**వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, రాష్ట్ర నాయకులు సీతారాం**

**ప్రజాశక్తి - ఉండి**



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నేతలు

సంపన్న కుటుంబంలో జన్మించి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల కోసం పాటుపడిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపాధి హామీ కార్మికుల ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెఎన్‌వి.గోపాలన్, మంతెన సీతారాం మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం కార్మికుల కష్టార్జితం, దోపిడీ జరిగి వారు నష్టపోయారని, ఆ విధానం గురించి కార్మికులకు మద్దతుగా మాట్లాడిన మొట్టమొదటి భూ యజమాని పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. నెల్లూరు జిల్లాలోని సంపన్న కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయాల కోసం తన పేరు చివర ఉన్న రెడ్డిని పేరు నుండి తొలగించి సుందరయ్య అని మార్చుకున్నారని గుర్తుచేశారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించిన వారిలో పుచ్చలపల్లి సుందరయ్య ముఖ్యులు అన్నారు. తనకు సంతానం కలిగితే కార్మికులకు న్యాయం చేయలేను అనే భావంతో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన తన యావదాస్తిని కార్మికుల సంక్షేమం కోసం, పార్టీ కోసం వెచ్చించారని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు యూనియన్ కావాలని వారికి సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని మొట్టమొదట పోరాడిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ కార్మికులకు బురిడి వాసుదేవరావు దాతృత్వంతో మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బురిడి వాసుదేవరావు, మునుకోలు వైకుంఠరావు, ధనికొండ శ్రీనివాస్, చిట్టి అన్నవరం, కార్మికులు పాల్గొన్నారు.

# పంట కాలువలు, మురుగు డ్రెయిన్ నిర్వహణకు చర్యలు : మంత్రి

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్రంలో పంట కాలువలు, మురుగు డ్రెయిన్ల నిర్వహణ, మరమ్మతు పనులకు సిఎం చంద్రబాబు రూ.344 కోట్లను కేటాయించినట్లు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని 18వ వార్డు గామాన్ వద్ద సిసి వాల్ నిర్మాణానికి రూ.77.45 లక్షలతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 24వ వార్డు లో టన్నెల్ నిర్మాణంకు రూ.30 లక్షలు కేటాయించారు. ఈ మే నెలాఖరు నాటికి పనులు పూర్తిచేసేలా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. రూ.10 లక్షలలోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో, 10 లక్షలు దాటితే ఏడు రోజుల్లోపు షార్ట్ టెండర్లు పిలవాలని ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత జూన్ నెలలో 90 కోట్లతో, సెప్టెంబర్‌లో అత్యవసర పనులుగా రూ.326 కోట్లతో పనులు చేసినట్లు చెప్పారు. రైతులకు మేలు చేసే కాలువల మట్టి తవ్వకం, తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. కాలువల వెంబడి గ్రావెల్ రహదారులు, కాంక్రీట్ గోడ నిర్మాణాలు వంటివి పెద్ద ఎత్తున చేపట్టినట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో అత్యవసర మెయింటినెన్స్ పనులకు అర్ధ రూపాయి ఖర్చు గాని, అరబస్త సిమెంట్ గాని, తట్ట మట్టి పని గానీ నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని మంత్రి నిమ్మల చెప్పారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



సిసి వాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

# వైఎస్‌ఆర్ కాలనీలో దారి ఏర్పాటు చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి - పోడూరు**



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపుతున్న సిపిఎం నేతలు


వైఎస్ఆర్ కాలనీలో వెంటనే దారి ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని చంద్రరాజు చెరువుకు ఆనుకొని ఉన్న వైఎస్ఆర్ కాలనీకి దారి ఏర్పాటుకు ఇటీవలే జరిగిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర కొనసాగింపులో భాగంగా శనివారం వైస్ఆర్ కాలనీలో వెంటనే దారి ఏర్పాటు చేయాలని మూడురోజులుగా తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌ను సిపిఎం మండల కమిటీ బృందం కలిసినప్పటికీ కనీసం కాలనీ వైపు అధికారులు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం కలెక్టరెట్ నుండి తహశీల్దార్‌కు వచ్చిన నివేదికను ఆచరణలో పెట్టకపోవడం దీని వెనుక అధికార పార్టీ అండదండలతోనే అధికారులు పనిచేస్తున్నారని వాపోయారు. విషయాలను అధికారులకు మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు వివరించారు. వచ్చి పరిశీలిస్తామని, రేపు, మాపు అంటూ కుంటు సాకులు చెపుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కాలానికీ దారి చూపాలని, మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాడ్ చేశారు. తక్షణం అధికారులు స్పందించకుంటే ఉధృతం తప్పదని వారు హెచ్చరించారు.

# అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు వందనం

**కలెక్టర్ నాగరాణి, మాజీ ఎంపీ సతీమణి అన్నపూర్ణ, పారిశుధ్య కార్మికులకు ఆనంద స్త్రీ పురస్కారాలతో సత్కారం**

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ.. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా ఆత్మీయతతో అనురాగాన్ని పంచుతున్న మహిళామూర్తులకు వందనమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో కీర్తిశేషులు ఉద్దరాజు వెంకటలక్ష్మీ నరసయ్య 50వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆనంద ఫంక్షన్ హాల్లో ఆనంద స్త్రీ పురస్కారాలు–25 నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు సతీమణి అన్నపూర్ణ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ కొల్లూరి వందన(తిరుపతి), జిల్లా వైద్య అధికారిణి గీతాబాయి, పోలీస్ శాఖ, ఆనంద గ్రూప్‌కు చెందిన ఆరుగురు ఉత్తమ సేవాతత్పరులకు, 50 మంది మున్సిపల్ మహిళ పారిశుధ్య కార్మికులకు పురస్కారాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ ఆత్మవిశ్వాసమే ఆడపిల్లలకు ప్రధాన ఆయుధమని, ఎలాంటి పరిస్థితిల్లో కూడా ధైర్యం కోల్పోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్ధరాజు కాశీ విశ్వనాథ్ రాజు, కంతేటి వెంకటరాజు, దాయన చంద్రాజీ, రఘుపతి రాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

# దేశంలో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర

**టెలిఫోన్ జెటిఒ పులి సాయిబాబా**

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని టెలిఫోన్ జెటిఒ పులి సాయిబాబా అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎడ్వార్ట్ ట్యాంక్ వద్ద బిఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ కార్యాలయంలో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రకాల పురాతన ఆధునిక టెలిఫోన్స్ చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. సాయిబాబా మాట్లాడుతూ వాతావరణ మార్పులను ఎదుర్కొవడం, మారుమూల ప్రాంతాలకు వైద్య సదుపాయాలు తదితర సమస్యలను అందించడంలో సమాచార సాంకేతిక వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రపంచంలోని సమాచారమంతా ఆ మూల నుంచి ఈ మూల వరకూ ఇప్పుడు సెకన్లలో చేరిపోతోందన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రపంచంలో టెలి కమ్యూనికేషన్ నెట్ వర్క్ ఉన్న దేశాల్లో భారత్ రెండవ అతి పెద్ద దేశంగా అవతరించిందన్నారు. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ దూసుకుపోతోందని, దేశ ఆర్థిక పరిపుష్టికి సమాచార రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, సిద్దబోయిన రామచార్యులు, కళింగ అప్పారావు, కాటుక బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## పరిశుభ్రత నెలకొల్పేందుకు చర్యలు : ఎస్‌పి

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**



కార్యాలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎస్‌పి

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ పరిశుభ్ర రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా చేపట్టిన స్వర్ణఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రతను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్, ఆర్మ్డ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

## భీమవరంలో తిరంగా బైక్ ర్యాలీ



తిరంగ ర్యాలీలో కేంద్ర మంత్రి వర్మ, తదితరులు

**భీమవరం :** ఉగ్రవాద చర్యలకు ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ దాడులు విజయవంతమయ్యాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతివనం వరకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు రాజకీయాలకు అతీతంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరంగా యాత్ర వేలాదిమంది పౌరులతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ర్యాలీలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఎంసి మాజీ ఛైర్మన్ కొళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పార్ట్ టైం ఉద్యోగం పేరుతో మోసం..

**రూ.10 లక్షలు మోసపోయిన వివాహిత**

**ప్రజాశక్తి - నరసాపురం**

పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఓ వివాహిత ఆన్‌లైన్‌లో టాస్కుల పేరుతో రూ. 10 లక్షలు మోసపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు. ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ఇన్‌స్టాగ్రాంలో పార్ట్ టైం ఉద్యోగం అంటూ, ఉద్యోగం చేసుకుని ఇంటి వద్దే సంపాదించవచ్చంటూ అనే రీల్ను చూసిందన్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు అందులో ఇచ్చిన ఫోన్ నెంబరుకు ఫోన్ చేసింది. వాళ్లు జాబ్ పేరుతో కొన్ని టాస్కులు ఇచ్చి మేము పెట్టిన పోస్టుకు మీరు లైక్‌లు కొట్టాలని, ఇలా కొట్టినా డబ్బులు వస్తాయని నమ్మించారు. ఇందుకు కొంత మొత్తం ముందుగా కట్టాలని నమ్మపలికారు. ఇది నిజమని బాధితురాలు వారు పంపించిన యుపిఎ నెంబర్కు రూ.10,44,200 కట్టింది. రేటింగ్ పెరుగుతున్న డబ్బులు రాకపోవడంతో బాధితురాలకు అనుమానం వచ్చి నిలదీశారు. మీ సొమ్ము తిరిగి ఇవ్వాలంటే మరో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఇంకా నమ్మించే ప్రయత్నం చేశారు. చివరికి తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించింది. బాధితులరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జయలక్ష్మి తెలిపారు.

## ఉప కారాగారం తనిఖీ

**ప్రజాశక్తి - నరసాపురం**

నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి శనివారం సాయంత్రం స్థానిక ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. జైల్ ముద్దాయిలకు సంబంధిత పోలీస్ వారి నుంచి తదుపరి వాయిదాలు తెలుస్తున్నది లేనిదీ, ఉచిత న్యాయ సలహాదారు ల పనితీరును, ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుల పనితీరును సబ్ జైల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, నీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు జైల్ ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జైల్ ముద్దాయిలకు నియమించబడిన ఉచిత న్యాయ సలహాదారులందరూ భాద్యతగా పని చేయాలన్నారు.

## వైద్య సేవలను వినియోగించుకోవాలి

### ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావైద్యశాల సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం శనివారం తెలిపారు. వైద్యురాలు డాక్టర్ శ్వేత ంప్రతి మంగళ, శుక్రవారాలు మహిళలకు గైనకాలజిస్టుచే ఉచితంగా ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారని, ఈ సేవలు అవసరమగు మహిళలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఉచితంగా రక్తపరీక్షలు, ఇసిజి, బిపి నిర్వహిస్తున్నామన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - యలమంచిలి

మేడపాడు హైస్కూల్లో శనివారం 2010-11 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. 15 సంవత్సరాల తరువాత కలుసుకున్న తరుణంలో ఒకరి యోగ క్షేమాలు ఒకరు తెలుసుకుని పులకరించారు. చదువుకునే రోజుల్లో జరిగిన ముచ్చట్లను జ్ఞాపకం చేసుకుని సంబరపడ్డారు. ఈ సందర్భంగా వారికి చదువులు చెప్పిన గురువులను సత్కరించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయంగా రూ.20 వేలు అందజేశారు.

## మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పుణ్యక్షేత్రాల దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా మరింత మౌలిక సదుపాయాలను కల్పిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం పంచారామక్షేత్రంలో ఒకటైన భీమవరం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం గాలి గోపురానికి రంగులు వేసే నిమిత్తం పూజ కార్యక్రమాలను ఎంఎల్‌ఎ అంజిబాబు నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చేరుకూరి రామకృష్ణలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఎంఎల్‌ఎ అంజిబాబు పూజ



కాళ్ల : అన్నసమారాధనలో యాత్రికులు

రాటా వేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. సుమారు రూ.8 లక్షలతో ఒక భక్తుని సహకారంతో గాలి గోపురానికి రంగులు వేయడం జరుగుతుందన్నారు. ఆలయ ఇఒ రామకృష్ణంరాజు, నల్లం చిట్టిబాబు, కొప్పినీడి శ్రీనివాస్, బ్యాంక్ బాబి, రెడ్డి సత్తిబాబు, వేలూరి సుబ్రహ్మణ్యం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాళ్లకూరులో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ: శ్రీవెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు స్వామివారి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సమారాధనకు కాళ్లకూరు పరిసర గ్రామాలు, వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సాధు శ్రీదేవిశ్రీనివాస్, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్ రాజు, దాతలు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్ :** అన్నిదానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, భగవంతుని కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవంతుడు మెచ్చే పుణ్య కార్యక్రమమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు, ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి మహా నివేదన చేశారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మహా నివేదనకు హారతులు ఇచ్చి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షించతగ్గ విషయమని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. శనివారం సరిపల్లి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవిలో సచివాలయానికి వచ్చే స్థానికులకు, బాటసారులకు చలివేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చనుమూరి లక్ష్మీ భవాని, ఉపసర్పంచి ఎన్.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

## రేపు సారవ పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19న సోమవారం సారవ గ్రామ పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక పక్రియ జరుగుతుందని ఎన్నికల నిర్వహణ అధికారి, యలమంచిలి ఇఒపిఆర్‌డి జెవిడి.ప్రసాద్ తెలిపారు. ఉప సర్పంచి ఎన్నిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. ఉప సర్పంచి అభ్యర్థిని వార్డు సభ్యుల్లో ఒకరు ప్రతిపాదించాలని, మరొకరు బలపర్చాలన్నారు. ఇందుకు సంబంధించి వార్డు సభ్యులందరికీ నోటీసుల ద్వారా తెలియజేశామన్నారు. ఉప సర్పంచి పదవికి పోటీ ఉంటే వార్డు సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక పక్రియ చేపడతామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉప సర్పంచి ఎన్నిక పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## మద్యపాన రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయం

### ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మద్యపాన రహిత సమాజం ప్రభుత్వ ధ్యేయమని భీమవరం ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నానాజీ ఎంటర్ ప్రైజెస్ ముఠా కూలీలతో మద్యపాన వ్యసనం - జీవితం నాశనం అనే నినాదంతో ఎక్సైజ్ డిఎస్‌పి కుమారన్ ఆదేశాలతో అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ బలరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, తటవర్తి భాస్కరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ చివరి వారం, మే మొదటి వారంలో 2వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 2వ సెమిస్టర్‌లో మొత్తం 213 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత 71 శాతంగా నమోదయ్యింది. ఈ సందర్భంగా డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఉత్తీర్ణులైన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ టి.కృష్ణ, పరీక్షల కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంతంలో అపరచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే వెంటనే తమకు సమాచారం అందించాలని మెరైన్ ఎస్ఐ సోమశేఖర్ రెడ్డి గ్రామస్తులకు సూచించారు. మండలంలోని కేపీ పాలెం సౌత్‌లో అంతర్వేది మెరైన్ ఎస్ఐ సోమశేఖర్ రెడ్డి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తుల ప్రమాదాలను వివరించారు. దేశ సమగ్రత పెంపొందేలా అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు తారసపడినా, నిషేధిత మాదక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణా చేసిన 1093కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



# కొవ్వాడ అన్నవరంలో జోరుగా మట్టి తరలింపు

### ధ్వంసమవుతున్న సీసీ రోడ్లు
### ప్రమాదాల బారిన వాహనదారులు
### పట్టించుకోని రెవెన్యూ అధికారులు



మట్టిగడ్డలతో అధ్వానంగా ఉన్న సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వేసవి వచ్చిందంటే మట్టి వ్యాపారుల హడావిడి అంతా ఇంతా కాదు. ప్రభుత్వ నిబంధనలు ఎన్ని ఉన్నప్పటికీ అవేమీ తమకు వర్తించవనే రీతిలో మండలంలో మట్టి తోలకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా భీమవరం పట్టణానికి ఆనుకుని ఉన్న కొవ్వాడ అన్నవరం గ్రామపంచాయతీలో మట్టి తోలకాలకు గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నామని వాపోతున్నారు. మట్టి తోలకాలు పెద్ద పెద్ద లారీలతో సాగించడంతో మట్టి పెడలు రోడ్లపై పడిపోతున్నాయని, దీంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వేసిన సిమెంట్ రోడ్లు నాశనం అవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఈ తోలకలు సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మట్టి తోలకాల వల్ల సిమెంట్ రోడ్డుపై పడిన మట్టి పెడలతో సిమెంట్ రోడ్డు మట్టిరోడ్డులా తయారవుతుందని చెప్తున్నారు. రెండు రోజుల నుంచి మబ్బుల కారణంగా తేలికపాటి వర్షాలు పడుతున్నాయని, దీంతో రహదారి బురదగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు



బ్లేడు ట్రాక్టర్‌తో చదును చేస్తున్న మట్టి పూడిక స్థలం

చెబుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ వారు పట్టించుకోవట్లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామ విఆర్ఒని వివరణ కోరగా తాను ఊళ్లో లేనని, బయటకు వచ్చానని, వివరాలు కావలసి వస్తే రేపు చెప్తానని అన్నారు. పూడిక ఎన్ని ఎకరాలు అంటే.. ఎన్ని ఎకరాలో తనకు పూర్తిగా తెలియదన్నారు. ఏదేమైనా కోట్ల రూపాయల రహదారులు నాశనం చేస్తున్న మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని సంకా సీతారామయ్య, అనంతపల్లి ముత్యాలరావు, శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని సీతారామ మెడికల్ స్టోర్స్ యాజమాన్యం సంకా సోమరాజు తెలిపారు. సీతారామ మెడికల్ స్టోర్స్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పుస్తకాలు చదివితే మహా జ్ఞానులు అవుతారని తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రంథాలయంలో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన అనేక పుస్తకాలు ఉన్నాయని విద్యార్థులు ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు పంచతంత్ర కథలు వినిపించి ఆటలు ఆడించారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించారు. జనార్ధన రావు పిల్లలకు పొడుపు కథలు, మ్యాథమెటిక్స్‌లో సులువైన పద్ధతులు బోధించారు. ఆర్.నాగేంద్ర కుమార్ విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పెనుమంట్ర :** చదవడం మాకు ఇష్టం అంటూ ప్రతీ రోజు విద్యార్థులు ఉత్సాహంగా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో పాల్గొంటున్నారని గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 19వ రోజు పిల్లలకు విశ్రాంత ఇంగ్లిష్ టీచర్ పి.సువర్ణ గౌరి స్పోకెన్ ఇంగ్లీష్ గురించి వివరించారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో ఎం.దినేష్, ఎం.లోకేష్, జి.చైతన్య, బి.పూర్విక, కె.తనుష, జి.నాగ కార్తీక్ రెడ్డి, ఎం.గణేష్, బి.భాస్కర్, వి.కిషోర్, ఎస్.నారాయణ పాల్గొన్నారు.

## బడి బయట ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు..

**ఆచంట :** వికలాంగులకు భౌతిక కేంద్రాల ద్వారా సమగ్రశిక్ష ప్రాజెక్టు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఎంఇఒ-1 ఎ.ఉషారాణి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉషారాణి, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బడి బయట స్కూల్ వయసు గల ప్రత్యేక వికలాంగులు ఎవరూ ఉండకూడదని, ఒకవేళ ఎవరైనా ఉంటే వారిని దగ్గరగా ఉన్న పాఠశాలలో చేర్పించాలని అన్నారు. వికలాంగులకు భౌతిక కేంద్రాల ద్వారా సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ గుర్తింపు కార్యక్రమం ఈనెల 15 నుంచి జూన్ 9 వరకు కొనసాగుతుందని తెలిపారు. మండలంలో బడిబయట స్కూల్ వయస్సు గల ప్రత్యేక వికలాంగులు ఎవ్వరూ ఉండకూడదని, ఎవరైనా ఉంటే వారిని దగ్గరగా ఉన్న పాఠశాలలో ఎన్రోల్ చేయాలని, వికలాంగులకు భవిత కేంద్రాల ద్వారా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వికలాంగులకు అవసరమైన ఉచిత ఉపకరణాలు, అలవెన్సులు, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపి వ్యాయమం, ప్రత్యేక విద్య, ఇంటిదగ్గర విద్య, ఉచితంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్, వృతివిద్యా శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సాధారణ పాఠశాలలో కూడా భౌతిక అడ్డంకులు లేని రైలింగ్‌తో కూడిన ర్యాంపులు, టాయిలెట్స్ నిర్మాణాలు చేపడతున్నాయని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి పాఠశాల ఉడికెల్ యూ డైస్ ప్లస్‌లో ఎంటర్ చేయడంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్‌లు, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని తెలియజేస్తూ మండలంలో హెబిటేషన్స్ వారిగా ఎన్యూమరేటర్సును నియమించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు ఎస్ఎంపి.గణేష్, ఎంఆర్‌సి స్టాఫ్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## రక్తపోటు నియంత్రణ ఆరోగ్యానికి అవసరం

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి

**పెనుమంట్ర :** రక్తపోటు హెచ్చు తగ్గులు మానవులకు చేటు కలిగిస్తాయని, దాని నియంత్రణ ఆరోగ్యానికి అత్యంత అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ గీతాబాయి అన్నారు. శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా జిల్లాలోని పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆమె సందర్శించి ఒపి రోగులతో, స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి నుంచి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. రక్తపోటుని నియంత్రించు- ఆరోగ్యాన్ని పరిరక్షించు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ వడదెబ్బ తగిలిన వ్యక్తికి వైద్య సహాయం త్వరగా అందేటట్టు చూడాలని, ఒఆర్ఎస్ ద్రావణం లేదా నీటిని తాగించాలని తగు సూచనలు అందజేశారు. ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి, జిల్లా ఎప్మాలజిస్ట్ సుభాష్, స్థానిక పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

# పలుచోట్ల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'




తణుకులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఎల్‌ఎ, జెసి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల రోగాలు దరిచేరవని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతిశనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతుందని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ప్రజలు ఉదయం 11 తరువాత బయటకు వెళ్లవద్దని చెప్పారు. ఎండలో తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్యసిబ్బంది పాల్గొని స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు.

**తాడేపల్లిగూడెం :** ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా నిలపాలంటే స్వచ్ఛ నియోజకవర్గానికి ప్రజలు నడుం బిగించాలని, మనం స్వచ్ఛంగా ఉన్న నాడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జికి రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల ఛైర్మన్‌గా నియమించిన సందర్భంగా దుస్సాలువ కప్పి, పూల గుచ్ఛంతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ టైలరింగ్ అసోసియేషన్ ఛైర్మన్‌గా పదవి అందుకున్న ఆకాశపు స్వామి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం దగ్గర మొక్కలు నాటి, అక్కడ నుంచి ర్యాలీగా తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్ వద్ద బొలిశెట్టి శ్రీనివాస్ సేవాసమితి ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధ్యమని తాడేపల్లిగూడెం ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని




గణపవరంలో..

మిలటరీ మాధవరంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, సర్పంచి ముప్పిడి సూర్యకుమారి, ఉపసర్పంచి బండారు నాగరాజు మాట్లాడారు. అనంతరం ఉపాధి కూలీలతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించి వారికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి, చలివేంద్రంలో గ్రామస్థులకు మజ్జిగ అందించి, సచివాలయం వద్ద కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.ఫణికుమార్, ఎంఆర్‌సి ఎం.రవికిరణ్, మాజీ సర్పంచి కౌలూరి పరిమళ, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంచనపల్లి గ్రామంలోని రైస్ మిల్లులో నిర్వహించిన కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా రైస్‌మిల్ సిబ్బందికి వేస్ట్ మేనేజ్మెంట్ గురించి వివరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనే విధంగా వారికి అవగాహన కల్పించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. స్టేషన్ ఎస్ఐలు మురళీమోహన్‌రావు, ఆర్. దొరబాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**వీరవాసరం:** ప్రతిఒక్కరూ వేసవిలో వడదెబ్బకులోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైద్యులు తిప్పారపు రామచందర్, ఎంఎన్ఒ గంధం వీరస్వామి పాల్గొన్నారు.

**కాళ్ల :** గ్రామాల్లో ప్రజలు వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసి రెడ్డి అన్నారు. వేంపాడు గ్రామపంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి



కాళ్ల : వేంపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం నుంచి రక్షణ కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రతి మూడో శనివారం నిర్వహించాలన్నారు. పశువులకు, పక్షులకు నీటి సంరక్షణ కల్పించడం, మంచినీటి చెరువు పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, గ్రామ సర్పంచి యిర్రింకిపద్మావతి, గ్రామకార్యదర్శి సుంకర వెంకటేష్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ఆకివీడు :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, సిబ్బంది కార్యాలయ ప్రాంగణం శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వానకి లేచిన పిచ్చి మొక్కలు, పచ్చగడ్డి పీకి శుభ్రం చేశారు. కార్యాలయ ప్రాంగణంలో తూర్పు భాగం ఈ మూడో శనివారం మొక్కలు పీకారు. ప్రతి నెల మూడో శనివారం కార్యాలయాలు పరిశుభ్రం చేసే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ పని చేపట్టారు.

**పెనుమంట్ర :** పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పెనుమంట్ర తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోను, గరువు గ్రామ పంచాయతీ వద్ద స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమ లక్ష్యం ప్రజలకు వివరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**నరసాపురం:** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు తద్వారా ఆరోగ్య ప్రదమైన సమాజానికి దోహదపడాలని రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు అన్నారు. మండలంలోని రుస్తుంబాదలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 216 జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అయితం సత్యనారాయణ, ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ టి.లోకేష్, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





తాడేపల్లిగూడెంలో..

**తణుకు :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తణుకు పట్టణంలోని 6, 7 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 6, 7 వార్డుల్లో చెరువులో పేర్కొన్న తూడును డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో మందు పిచికారీ చేయడం జరిగిందని, చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మించడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్యాన్ని, పరిశుభ్రతను పెంచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సహకరించాలని కోరారు. జిల్లా నోడల్ అధికారి సూర్యకుమారి, మాట్లాడారు. పారిశుధ్య కార్మికులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ భానో, తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది 16 మంది పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముచర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.వాసు పర్యవేక్షించారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్‌ను శుభ్రం చేసారు. ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాస్, ఎస్ఐలు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశు




మొగల్తూరులో..

భ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రం మొగల్తూరులో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పారిశుధ్య పనుల నిర్వహణపై పర్యవేక్షించారు. వేసవిలో పక్షులకు తాగు నీరు సదుపాయం కల్పించారు. ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి పర్యావరణం నష్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**ఉండి:** గ్రామాలు శుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని వాండ్రం గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## రీ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాందువ్వ గ్రామంలో ప్రారంభించిన రీ సర్వే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల తహశీల్దార్ కావడి నాగార్జున పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు సరిహద్దు తగాదాలు ఉండకూడదు, ఎవరి స్థలాలు వారి నిజ నిర్ధారణ చేసుకోవాలి అనే ఉద్దేశంతో రీసర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ అధికారులు రీసర్వే చేసే సమయంలో అవసరమైన పత్రాలను చూపించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు ఉన్నారు.

## జనసైనికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సవిత్రుపేట 15వ వార్డుకు చెందిన జన సైనికుడు గంధం నాగేంద్ర అకాల మరణాన్ని చింతిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ఎంఎల్‌ఎ బొలిశెట్టి రూ.1,50,000 ఆయన సొంత నిధులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపుకు అవిశ్రాతం పోరాడిన జనసైనికుడు గంధం నాగేంద్ర వడ దెబ్బకు ప్రాణాలు కోల్పోయి అందరిని శోకసంద్రంలో మిగిల్చారని అన్నారు. కార్యక్రమంలో సవిత్రుపేట 15వ వార్డు జనసేన ఇన్‌ఛార్జి అడబాల రామారావు, పత్యాల వెంకన్న, పజ్జూరి శ్రీను, లక్ష్మీశెట్టి కిరణ్ కుమార్, సుంకర శ్రీను, గూడవల్లి రవణ, వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

## సమావేశానికి అధికారులు హాజరవ్వాలి : ఎంపిపి

ప్రజాశక్తి - గణపవరం

మూడునెలలకు ఒకసారి జరిగే మండలపరిషత్ సమావేశానికి అధికారులు అందరూ హాజరుకావాలని గణపవరం మండలపరిషత్ అధ్యక్షులు దండు వెంకట రామరాజు(అర్ధవరం రాము) అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ భవనంలో జరిగిన సమావేశానికి అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. ఈ సమావేశానికి కేవలం నలుగురు అధికారులు మాత్రమే హాజరుకావటంతో మండల సమస్యలు ఎలా తెలుస్తాయని అన్నారు. ప్రభుత్వం మారినా ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి పనిచేస్తే మండలాభివృద్ధి అవుతుందని అన్నారు. సమావేశంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి వై.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో సొమ్ములు జూన్‌లో జమ చేయటం జరుగుతుందని చెప్పారు. రైతులు తమ వరి పొలాలకు ఆధార్ లింకు చేసుకోవాలని అన్నారు. ఆధార్ లింక్ లేకపోతే సొమ్ములు పడవని చెప్పారు. కౌలు రైతులకు కూడా అందుతాయని చెప్పారు. 126 రకం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. విద్యుత్ ఎఇ ఏడుకొండలు మాట్లాడారు. సమావేశంలో ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ పి.తులసి, పంచాయతీ రాజ్ డిఇ స్వామి నాయుడు, సిహెచ్ఒ విల్సన్ బాబు ఉన్నారు.

## సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలు పెంచాలి

ప్రజాశక్తి - పెనుగొండ

జిల్లా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బివిఎస్.రామాంజనేయ రాజు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇరగవరం, పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ మండల సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరంకు సాంఘిక సంక్షేమ హాస్టల్లో మెరుగైన మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని, హాస్టల్లో డ్రాప్ అవుట్లను మరలా హాస్టల్లో చేర్పించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తణుకు సహాయ సాంఘిక అధికారి పి.నాగ సాయిమ్మ, మండల సమన్వయ కమిటీ అధికారి జి.ఫణికుమార్, కె.నర్సమ్మ, వై.అరుణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.